సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



కిలో టమాట రూ.51

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.51, కనిష్టంగా రూ.27, సరాసరిన రూ.40 ప్రకారం ధర పలికింది.



మొక్కజొన్న రైతు కుదేలు

తీవ్ర వర్షాభావంతో మొక్కజొన్న తుడిచిపెట్టుకుపోయింది. పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.9°/21.4°

జిల్లావ్యాప్తంగా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం తగ్గి ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్షయ నివారణకు పకడ్బందీ చర్యలు

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లాలో క్షయ (టీబీ) నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిషేక్ కుమార్ వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. 'ప్రధాన మంత్రి టీబీ ముక్త అభియాన్' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తూ టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులంతా కృషి చేయాలన్నారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. టీబీ నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా టీబీ నియంత్రణ కార్యక్రమాలు విరివిగా నిర్వహించాలన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రజలకు క్షయపై అవగాహన కల్పించాలన్నారు. క్షయ కేసులు అధికంగా నమోదవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 8 టీబీ యూనిట్ల పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 1,750 కేసులు నమోదయ్యాయన్నారు. క్షయ బారిన పడిన వారికి హెచ్ఐవీ, మధుమేహం పరీక్షలు నిర్వహించడంతో పాటు వారి ఆరోగ్యానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ కొండయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, డీఎల్‌టీఓ డాక్టర్ తిప్పయ్య, డాక్టర్ రఘు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న పి.విజయశాంతి

ప్రశాంతి నిలయం: జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) గా పి.విజయశాంతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది సర్వే, ల్యాండ్ రికార్డ్స్ శాఖలో చేరిన విజయశాంతి విజయవాడలో ఏడాదిగా శిక్షణ తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారులు ఇక్కడ పనిచేస్తున్న ఏడీ రామకృష్ణన్ అమరావతిలోని సీఆర్‌డీఏకి బదిలీ చేసి ఆయన స్థానంలో విజయశాంతిని నియమించారు. దీంతో శనివారం ఆమె ఏడీగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు సర్వే, ల్యాండ్ రికార్డ్స్ శాఖ ద్వారా నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. భూ సర్వేకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అందుబాటులో ఉన్న సర్వేయర్లను వినియోగించుకుని మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

24 మండలాల పరిధిలో వర్షం

- గుడిబండలో అత్యధికంగా 82 మి.మీ వర్షపాతం నమోదు



పుట్టపర్తి అర్బన్: ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 24 మండలాల పరిధిలో మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా గుడిబండ మండలంలో 82.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక చిలమత్తూరు మండలంలో 68.6 మి.మీ, లేపాక్షి 65.4, మడకశిర 54.5, నల్లమాడ 41.8, అగళి 38.4, అమరాపురం 32.4, హిందూపురం 30.4, రొళ్ల 29.4, రొద్దం 27.4, కొత్తచెరువు 26.4, గోరంట్ల 26, బుక్కపట్నం 25.6, కనగానపల్లి 22.4, సోమందేపల్లి 20.6, రామగిరి 20.2, సీకేపల్లి 18.2, పరిగి 15.6, పుట్టపర్తి 13.8, పెనుకొండ 10.0, అమడగూరు 8.6, తనకల్లు 3.2, ఓడీచెరువు, నల్లచెరువు మండలాల పరిధిలో 2.2 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. 24 గంటల్లోనే జిల్లా వ్యాప్తంగా 685.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తాజా వర్షాలతో చెక్‌డ్యాంలలోకి నీరు చేరింది.

చేనేత బతుకు ఛిద్రం

కట్టుకుంటే సంగీతం వినిపించే మ్యూజికల్ చీర, ఎప్పుడూ సంపంగి పూల వాసన గుబాళించే సంపంగి చీర, అన్నపూర్ణేశ్వరి, పుష్పవల్లి, రంగవల్లి వంటి రకరకాల పట్టు చీరలతో ధర్మవరం నేతన్నలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. కానీ కొందరు వ్యాపారులు మరమగ్గాలపై చేనేత రకాలు తయారు చేస్తూ నేతన్నల బతుకులను ఛిద్రం చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు కళ్లుమూసుకుని ఉండగా..మగ్గం మూలనపడుతోంది. నేతన్న ఉనికి ప్రశ్నార్థకమవుతోంది.

మరమగ్గాలతో జీవనోపాధి కోల్పోతున్న చేనేతలు

- కర్ణాటక నుంచి ఇబ్బడి ముబ్బడిగా ధర్మవరానికి పవర్‌లూమ్స్ చీరలు
- చేనేత రిజర్వేషన్ చట్టానికి తూట్లు పొడుస్తున్న వైనం
- కట్టడి చేయడంలో హ్యాండ్‌లూమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విఫలం
- ఉపాధి కోసం ఇతర వృత్తుల్లోకి నేతన్నలు.. మూతపడుతున్న మగ్గాలు



ధర్మవరంలోని ఓ నేతన్న ఇంట్లో దుమ్ముపట్టి ఉన్న మగ్గం

ధర్మవరం: తమ పనితనంతో అంతర్జాతీయంగా పేరుగాంచిన నేతన్నల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. జిల్లాలో 28 వేల దాకా చేనేత మగ్గాలుండగా, ఒక్క ధర్మవరంలోనే 20 వేలు ఉన్నాయి. ఈ మగ్గాలపై ఆధారపడి వేలాది కుటుంబాలు బతుకుతున్నాయి. ఇక చేనేత అనుబంధ రంగాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది ఆధారపడి జీవిస్తున్నారు. కానీ పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని మరమగ్గాల మాఫియా వీరందరి బతుకులను ఛిద్రం చేస్తోంది. చేనేత రిజర్వేషన్ చట్టానికి తూట్లు పొడుస్తూ ధర్మవరం పట్టుచీరలకు జిరాక్స్‌లాగా మరమగ్గాలపై చీరలను తయారు చేసి తక్కువ ధరకే మార్కెట్‌లోకి తెస్తోంది. దీంతో మగ్గంపై తయారు చేసిన పట్టుచీరలకు గిరాకీ లేకుండా పోయింది. పెరిగిన ముడిపట్టు ధరలు, కూలి గిట్టుబాటు కాకపోవడం తదితర కారణాలతో... గత్యంతరం లేని స్థితిలో నేతన్నలు మగ్గాలను మూలకుపెడుతున్నారు.

యమపాశంగా పవర్‌లూమ్స్

మారుతున్న ఫ్యాషన్ ప్రపంచానికి దీటుగా ధర్మవరం నేతన్నలు ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లు రూపొందిస్తున్నారు. వినూత్న డిజైన్లతో సినీతారలు, సెలబ్రిటీలనూ ఆకట్టుకుంటున్నారు. కానీ పవర్‌లూమ్స్ దెబ్బకు విలవిల్లాడిపోతున్నారు. ఒక కార్మికుడు మగ్గంపై సగటున 5 రోజులకు ఒక చీర నేస్తే... అదే పవర్‌లూమ్స్‌లో రోజుకు రెండు చీరలు నేస్తున్నారు. చేనేత మగ్గంపై తయారైన చీరకు, మరమగ్గంపై తయారైన పట్టు చీరకు ధరలో 30 శాతం తేడా ఉండటంతో వ్యాపారులు చేనేత మగ్గాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీంతో నేతన్నలకు పని లేకుండా పోతోంది.

కర్ణాటక రాష్ట్రం నుంచి ఇబ్బడి ముబ్బడిగా...

కర్ణాటకలోని దొడ్డబళ్లాపూర్, యలహంక, బాగేపల్లి, బెంగళూరు తదితర ప్రాంతాల్లోని మరమగ్గాలపై తయారవుతున్న పట్టు చీరలు ధర్మవరం మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. చేనేత రిజర్వేషన్ చట్టం ప్రకారం పవర్‌లూమ్స్‌లో వందశాతం పట్టుదారంతో, డిజైన్లను తయారు చేయకూడదు. పవర్‌లూమ్స్‌లో తయారయ్యే పట్టు చీరలలో 52 శాతానికి మించి జరీ వాడకూడదు. బార్డర్, పల్లు డిజైన్లు చేనేత మగ్గంలో తయారయ్యే వాటిని వాడకూడదన్న నిబంధనలున్నాయి. 11 రకాల డిజైన్లు మరమగ్గాలలో తయారు కాకూడదన్న నిబంధనలతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని సైతం రూపొందించింది. అయితే ఈ నిబంధనలను తుంగలో తొక్కిన మరమగ్గాల మాఫియా... ఇష్టారాజ్యంగా పట్టు చీరలను తయారు చేసి చేనేతల పొట్ట కొడుతోంది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా కర్ణాటకలోని మరమగ్గాల్లో తయారు చేసిన పట్టు చీరలను ప్లాస్టిక్ సంచుల్లో నింపి బస్సులు, కార్లలో ధర్మవరం తీసుకువస్తున్నారు. ఎవరైనా అడిగితే స్క్రాప్ అని చెబుతున్నారు. అనంతరం ఆ చీరలను పాలిష్ చేయించి నేసేపేటకు తరలించి విక్రయిస్తున్నారు.



మరమగ్గాలపై తయారు చేసిన చీరలను మూటల్లో ధర్మవరం తెచ్చిన దృశ్యం



సిల్క్‌హౌస్‌లకు కేరాఫ్‌గా ఉన్న ధర్మవరంలోని నేసేపేట



సిల్క్ హౌస్‌లో ఉన్న మగ్గంపై నేసిన చీరలు

మరమగ్గాలకు చేనేతల మొగ్గు

చేనేత మగ్గాల నిర్వహణ కష్టతరం కావడంతో జిల్లాలోని ముదిరెడ్డిపల్లి, గోరంట్ల, సోమందేపల్లి, ధర్మవరంలో సైతం క్రమంగా మరమగ్గాల ఏర్పాటుకు చేనేతలు మొగ్గు చూపుతున్నారు. మరమగ్గాలపై పట్టు ఉత్పత్తులను తయారు చేస్తూ ధర్మవరం నేసేపేటలో విక్రయిస్తున్నారు. ధర్మవరం నేసేపేటలోని 1,800 సిల్క్‌షాపుల్లో రోజుకు సగటున రూ.5 కోట్ల నుంచి రూ.7 కోట్ల దాకా టర్నోవర్ జరిగితే అందులో 60 శాతానికిపైగా మరమగ్గాలలో తయారయ్యే పట్టు చీరలు విక్రయాలు జరుగుతున్నాయని వ్యాపార వర్గాల అంచనా.

మూతపడుతున్న చేనేత మగ్గాలు

మరమగ్గాల ధాటికి నేతన్నల పనితనం చిన్నబోతోంది. రోజంతా కష్టపడినా నష్టాలు వస్తుండటంతో నేతన్నలు మగ్గాలను పక్కన పెడుతున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 నెలల కాలంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేనేత మగ్గాలు భారీగా మూతపడ్డాయి. అన్‌సీజన్‌లో అయితే పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. గతంలో అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతిమగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల చొప్పున రంథన్‌గా సాయం అందించేది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 'నేతన్న నేస్తం' పథకానికి మంగళం పాడటంతో చేనేతల పరిస్థితి దుర్భరంగా మారింది.

మామూళ్ల మత్తులో అధికారులు

చేనేత రిజర్వేషన్ చట్టం ఉల్లంఘించి మరమగ్గాలపై చేనేత రకాలను తయారు చేస్తున్నా హ్యాండ్‌లూమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మామూళ్ల మత్తులో కళ్లు మూసుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చేనేత సంఘాల నుంచి ఎప్పుడైన ఒత్తిడి వస్తే తూతూమంత్రంగా దాడులు చేయడం... చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. ఇక కర్ణాటక రాష్ట్రంలో పవర్‌లూమ్స్ నిర్వహించే యజమానులు సిండికేట్‌గా ఏర్పడి అధికారులకు నెల నెలా మామూళ్లు ముట్టజెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందుకే వారి పవర్‌లూమ్స్‌ను పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి



కేంద్ర ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తేనే చేనేత రంగం మనుగడ సాగిస్తుంది. లేకపోతే ఒకప్పుడు చేతి మగ్గం ఉండేదన్న విషయాన్ని భావితరాలు చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. సంక్షోభంలో చేనేతకు ఊతమిచ్చేందుకు నేతన్ననేస్తం పథకం అమలు చేసి ముడిపట్టుపై రాయితీ ఇవ్వాలి.

–జింకా రంబగిరి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం

ఉపాధి దెబ్బతింటోంది



కర్ణాటక రాష్ట్రంలోని పవర్ లూమ్స్ యజమానులు ఇబ్బడి ముబ్బడిగా పట్టు చీరలను తయారు చేసి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దీని ప్రభావం చేనేత కార్మికుల ఉపాధిపై చూపుతోంది. పట్టు చీరకు కూలి కూడా గిట్టుబాటు కాని పరిస్థితుల్లో మగ్గం పక్కనపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే నేతన్నల ఉనికి ప్రశ్నార్థకమవుతుంది.

–శంకర్, చేనేత కార్మికుడు, కేశవనగర్, ధర్మవరం

నష్టాలు చవిచూస్తున్నాం



ఇటీవల ముడిపట్టు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. రోజంతా కష్టపడి చీరలు నేసినా కూలి గిట్టుబాటు కావడం లేదు. ఒక్కోసారి నష్టాలను చవిచూసే పరిస్థితి ఏర్పడుతోంది. అన్ సీజన్‌లో అయితే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ప్రభుత్వం స్పందించి 'నేతన్న నేస్తం' పథకంతో పాటు ముడి పట్టు రాయితీ ఇవ్వాలి.

–కాంతమ్మ, చేనేత కార్మికురాలు, శివానగర్, ధర్మవరం

అధికారులు విఫలం వల్లే..



చేనేత రిజర్వేషన్‌కు తూట్లు పొడిచి మరమగ్గాలపై పట్టు చీరలను ఇబ్బడి ముబ్బడిగా తయారు చేస్తున్నా..హ్యాండ్‌లూమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పవర్‌లూమ్స్ యజమానుల సిండికేట్ ఇచ్చే మామూళ్లకు కక్కుర్తి పడి నేతన్నలకు అన్యాయం చేస్తున్నారు. అందువల్లే ఇంతవరకూ ఎక్కడా మరమగ్గాల యజమానులపై కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు జిల్లాలో హ్యాండ్‌లూమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేసి చిత్తశుద్ధితో తనిఖీలు నిర్వహించాలి. కర్ణాటక నుంచి వచ్చే పవర్‌లూమ్స్ పట్టు ఉత్పత్తులు నియంత్రిస్తేనే చేనేతకు భవిష్యత్ ఉంటుంది.

–రంగన అశ్వర్థనారాయణ, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్

ప్రశాంతి నిలయంలో దసరా వేడుకలు

- నేటి నుంచి వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం



సత్యసాయి మహాసమాధి (ఫైల్)

ప్రశాంతి నిలయం: అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రం ప్రశాంతి నిలయంలో ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకూ దసరా వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే సాయికుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం నుంచి 12వ తేదీ వరకూ రోజూ ప్రత్యేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు పూర్ణచంద్ర ఆడిటోరియంలో వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞం ప్రారంభం కానుంది. సాయంత్రం ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ వి.భాస్కర్ ప్రసంగం, ముద్దనహళ్లి క్యాంపస్ విద్యార్థుల సంగీత విభావరి ఉంటుంది. 7వ తేదీ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్.మల్లవరపు శ్రీనివాసరావు భక్తులనుద్దేశించి ప్రసంగించనున్నారు. 8వ తేదీ సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో డాక్టర్ కెఎస్ నరేష్ ప్రసంగం, ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 9వ తేదీ డాక్టర్ ప్రత్యూష భక్తులనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతపురం క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు సంగీత కచేరీ ఉంటుంది. 10వ తేదీ సాయంత్రం డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి ప్రసంగం ఉంటుంది. 11వ తేదీ సాయంత్రం డాక్టర్ కేజే శ్రీనివాసరావు ప్రసంగం, సత్యసాయి బృందావన్ క్యాంపస్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. వేడుకల్లో చివరిరోజైన 12వ తేదీ ఉదయం వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం మహాపూర్ణాహుతి కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం జయంత్ కుమారేష్ బృందం సంగీత విభావరి ఉంటుందని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ తెలిపింది.

జీఆర్పీ పోలీసులకు ప్రతిష్టాత్మక అవార్డు



డీజీపీ నుంచి అవార్డు అందుకుంటున్న జీఆర్‌పీ ఎస్పీ రాహుల్‌మీనా



అవార్డు అందుకున్న సీఐ నగేష్‌బాబు

గుంతకల్లు: చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన గుంతకల్లు జీఆర్పీ పోలీసులకు ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. శుక్రవారం విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు నుంచి గుంతకల్లు రైల్వే జిల్లా జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా పురస్కారం అందుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు ఏటా ఏ, బీ, సీ, డీ అవార్డులను ప్రదానం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో గుంతకల్లు రైల్వే పోలీసులు మూడో స్థానంలో నిలిచి ఈ అవార్డును అందుకున్నారు. ఇటీవలే గుంతకల్లు జీఆర్‌పీ ఎస్పీ కె.చౌడేశ్వరి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తు చౌడేశ్వరి ఎస్పీగా ఉన్న సమయంలో జరిగింది. దీంతో ప్రస్తుత ఎస్పీ రాహుల్ మీనాతోపాటు ఆమెకు కూడా అవార్డును ప్రదానం చేశారు. కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన గుంతకల్లు జీఆర్‌పీ సీఐ నగేష్‌బాబుకు డీజీపీ ప్రశంసాపత్రం అందజేశారు.

లడ్డూపై రాద్ధాంతం ఆపు బాబూ

- సుప్రీం తీర్పు కూటమి సర్కార్‌కు చెంపపెట్టు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



పెనుకొండ రూరల్: ''చంద్రబాబు వంద రోజుల పాలనలో ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయారు. ఒక్కటంటే ఒక్క హామీ నెరవేర్చలేకపోయారు. దీంతో ప్రజల్లోనూ ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీన్ని గుర్తించే ప్రజలను డైవర్ట్ చేసేందుకు తిరుమల లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారు. తన స్వార్థం కోసం శ్రీవారిని రాజకీయాల్లోకి లాగారు. కానీ దేశ సర్వోన్నత న్యాయస్థానం చంద్రబాబు చర్యలను తప్పుబట్టింది. సీఎం హోదాలో ఆధారాలు లేకుండా ఎలా మాట్లాడారంటూ మొట్టికాయలు వేసింది. ఇప్పటికైనా చంద్రబాబు లడ్డూపై రాద్ధాంతం ఆపాలి'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. శనివారం ఆమె పెనుకొండలో మీడియాతో మాట్లాడారు. 'లడ్డూ' వివాదంలో చంద్రబాబు తన మాటలను తాను నియమించిన 'సిట్'తో చెప్పించాలని చూశారన్నారు. కానీ సుప్రీంకోర్టు స్వయం ప్రతిపత్తిగల దర్యాప్తు సంస్థను నియమించి మంచిపని చేసిందన్నారు. సుప్రీం తీర్పు కూటమి సర్కార్‌కు చెంపపెట్టులాంటిదన్నారు. కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన చంద్రబాబుకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. ఇక చంద్రబాబుకు వంతపాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విదూషకుడిలా తయారయ్యారని ఉషశ్రీచరణ్ అన్నారు. ఇకనైనా చంద్రబాబు దేవుడిని రాజకీయాల్లోకి లాగడం మానుకోవాలని హితవు పలికారు. వీలైతే నమ్మి ఓటు వేసి అధికారం అప్పగించిన ప్రజలకు మేలు చేయాలని, కుట్ర పూరిత రాజకీయాలను మానుకోవాలన్నారు.

కాటమరాయా.. కరుణించవయా



ఖాద్రీశుని దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

- ఖాద్రీశుని దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు

కదిరి టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాలు.. దసరా సెలవులు..స్వామి జన్మనక్షత్రమైన స్వాతి శనివారం కలగలిపి రావడంతో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కాటమరాయా...కరుణించవయా అంటూ వేడుకున్నారు. భక్తజనంతో ఆలయం ప్రాంగణం కిటకిటలాడింది.

నృసింహుడి అలంకరణలో ఖాద్రీశుడు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీనారసింహుడు శనివారం రాత్రి నృసింహ అవతార అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



నృసింహావతార అలంకరణలో లక్ష్మీనరసింహుడు

క్లుప్తంగా

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

అమడగూరు: బాలికపై జరిగిన అత్యాచారం ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను అమడగూరు పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని దర్యాప్తు వేగవంతం చేశామన్నారు. అత్యాచారానికి పాల్పడిన ఎ.పుట్లవాండ్లపల్లికి చెందిన రాజశేఖర్‌ను బిళ్లూరు క్రాస్‌లో అరెస్ట్ చేసి.. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. బాలిక చదువు మధ్యలో ఆగిపోకుండా, ఆమెకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఉమెన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ల్యాబ్‌లో ప్రాథమిక రిపోర్టులు పరిశీలించిన అనంతరం నిందితుడిపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మూడు ట్రాక్టర్లు, టిప్పర్ పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను, ఒక టిప్పర్‌ను ఎస్ఐ శ్రీనివాసులు పట్టుకున్నారు. శనివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో కలిసి రామాపురం వద్ద వాహనాలను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఇసుకను అక్రమంగా తరలించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రశీదులు ఉన్న వారు రీచ్‌లు, స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

కనగానపల్లి: దాదులూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం పెనుకొండ వైపు నుంచి అనంతపురం వెళ్తున్న ఆటోను దాదులూరు సమీపాన వెనుక వైపు నుంచి కారు ఢీకొంది. ఆటో వెనుక భాగమంతా దెబ్బతిని అందులో ప్రయాణిస్తున్న గోరంట్లకు చెందిన చిన్నముత్యాలు, లక్ష్మీదేవి, శైలజ గాయపడ్డారు. స్థానికులు గుర్తించి వెంటనే 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

మొక్కజొన్న రైతు కుదేలు

- చిలమత్తూరు మండలం మరువకొత్తపల్లికి చెందిన రైతు చితంబరరెడ్డి 3 ఎకరాల్లో వర్షాధారం కింద మొక్క జొన్న సాగు చేశాడు. పంట మొదట్లో ఆశాజనకంగా ఉన్నా సెప్టెంబరులో వర్షం కురవక పోవడంతో ఎండిపోయింది. పెట్టుబడి సైతం తిరిగారాని పరిస్థితి.
- హిందూపురం మండలం చలివెందులకు చెందిన రైతు నరసింహప్ప రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. వెన్ను వదిలే సమయంలో వర్షం లేక జొన్న కంకులు ఎండిపోయాయి. దీంతో పంట దిగుబడి సగానికి సగం తగ్గి పోయింది.
- వర్షాభావంతో దిగుబడి తగ్గడం.. వచ్చిన అరకొర పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతు కుదేలవుతున్నాడు.

- సెప్టెంబర్‌లో వర్షాభావం ఎఫెక్ట్..
- పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం
- ధరలు సైతం గణనీయంగా తగ్గుదల


చిలమత్తూరు చెరువు కింద మొక్క జొన్న కోతలు


ఆరబోసిన మొక్కజొన్న గింజలు

హిందూపురం అర్బన్: మొక్కజొన్న రైతులను వర్షాభావం కోలుకోలేని దెబ్బ తీసింది. పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపడంతో పెట్టుబడులు తిరిగి రాని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 3,93,252 ఎకరాల సాగు భూమి ఉంది. ఈ ఖరీఫ్‌లో జూలై నెలలో వర్షాలు సమృద్ధిగా పడటంతో చాలామంది రైతులు ఎన్నో ఆశలతో మొక్కజొన్న సాగు చేశారు. వర్షాధారం కింద 98 వేల ఎకరాల్లో, బోర్ల కింద మరో 30 వేల ఎకరాలు మొత్తం 1.28 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగులోకి వచ్చింది. విత్తనం, ఎరువులు, కలుపు, మందులు, కూలీల ఖర్చులు వెరసి ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చు చేశారు. అయితే సెప్టెంబరు నెలలో తీవ్ర వర్షాభావం నెలకొనడంతో పొట్ట దశలో ఉన్న మొక్కజొన్న ఎండిపోయింది. అరకొర పంట ఉన్నా దాన్ని పొట్టు నుంచి వేరు చేసి.. ఎండించి అమ్మకం చేసేందుకు కూలీల ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఈసారి 30 లక్షల క్వింటాళ్ల దిగుబడులు రావాల్సి ఉండగా.. వర్షాభావం కారణంగా 12.80 లక్షల క్వింటాళ్లకు మించి వచ్చే అవకాశం లేదు.

ధరలు ధమాల్

మొక్క జొన్న పంట ఇప్పుడిప్పుడే చేతికి వస్తోంది. మార్కెట్‌లో వారం క్రితం వరకు క్వింటాలు రూ.2,800 ఉండగా.. అక్టోబర్ రెండో తేదీన రూ.2,200కు పడిపోయింది. ఉత్పత్తి తగ్గినా.. వచ్చిన అరకొర సరుకులో తేమ శాతం ఎక్కువగా ఉందని సాకు చూపి ధరలు తగ్గించేస్తున్నారు. అంతే కాదు క్వింటాకు అదనంగా రెండు కిలోలు తీసేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడం.. ఒక వేళ పంట దెబ్బతింటే బీమా, పరిహారం అందించి రైతులను అన్ని విధాలా ఆదుకున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితులు ఏపీ కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

గిట్టు బాటు ధర కల్పించాలి



మొక్కజొన్న పంట అరకొరగా చేతికొచ్చిన సమయంలో ధరలు తగ్గాయి. క్వింటాపై రూ.600 పడిపోయింది. ప్రభుత్వమే మొక్కజొన్న కొనుగోలు చేసి మంచి ధర అందించాలి. గత ప్రభుత్వంలో మాదిరిగా రైతులకు భరోసా కల్పించాలి.

– గోవిందరెడ్డి, నల్లరాళ్లపల్లి, చిలమత్తూరు మండలం

దిగుబడి సగం కూడా లేదు



మొక్కజొన్న పంట మొదట్లో ఊరించినా సెప్టెంబర్‌లో వర్షం కురవకపోవడంతో ఎండుముఖం పట్టింది. పంట దిగుబడి సగం కూడా వచ్చే అవకాశం లేదు. పండిన అరకొర పంటకు కూడా ధరలు పడిపోయి దారుణంగా దెబ్బతీశాయి. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి.

– చితంబరరెడ్డి, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

జనసేన నాయకుడి చీనీ చెట్ల నరికివేత

- టీడీపీ నేతలపైనే అనుమానం


చీనీచెట్లు నరికివేసిన పొలంలో డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న పోలీసులు

బత్తలపల్లి: తంబాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు కర్రు రమణారెడ్డికి చెందిన 33 చీనీ చెట్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్రు రమణారెడ్డి రెండు ఎకరాల పొలంలో మూడేళ్ల కిందట 370 చీనీ మొక్కలు సాగు చేశాడు. శనివారం మరో ప్రాంతంలోని పొలం వద్దకు వెళ్లి పనులు ముగించుకుని, మధ్యాహ్నం చీనీ పొలం వద్దకు చేరుకున్నాడు. అయితే 33 చీనీచెట్లు నరికివేసి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తమకు ఎవరితోనూ గొడవలు లేవని, శత్రుత్వం కూడా లేదని బాధితుడు తెలిపాడు. ఈ దుశ్చర్యకు ఎవరు పాల్పడ్డారో.. ఎందుకు చేశారో తమకు తెలియదని వాపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చౌక డిపో కోసమేనా?

కూటమి అధికారంలోకి వచ్చాక తంబాపురంలో చౌకధాన్యపు డిపో డీలర్‌షిప్ కోసం టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఆధిపత్య పోరు నెలకొంది. దీనిపై నియోజకవర్గంలోని అధినేతల వద్ద పంచాయితీ కూడా జరిగింది. చర్చలు కొలిక్కి రాకపోవడంతో ఈ నెల కూడా స్టోర్ బియ్యం వీఆర్ఏల ఆధ్వర్యంలో పంపిణీ జరిగేలా అధికారులు ఆదేశించారు. ఈ మేరకు బియ్యం బస్తాలు శుక్రవారం ఉదయం పాఠశాలలో నిల్వ చేశారు. అదే రోజు రాత్రికి చీనీ చెట్లు నరికి వేయడంతో తమకు స్టోర్ రాకుండా జనసేన వారు అడ్డుపడుతున్నారనే కారణంతోనే టీడీపీ వర్గీయులు ఈ దురాగతానికి పాల్పడి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదికాకుండా మూడో వ్యక్తులు రంగప్రవేశం చేసి ఉంటారా? అన్న కోణంలోనూ పోలీసులు విచారణ చేస్తున్నారు.

త్వరలో నిందితులను పట్టుకుంటాం

పుట్టపర్తి నుంచి శనివారం సాయంత్రం డాగ్ స్క్వాడ్‌ను ఎస్ఐ శ్రీనివాసులు రప్పించి నిందితులను కనుక్కునేందుకు ప్రయత్నించారు. పొలంలో డాగ్ స్క్వాడ్ పరిశీలించి గ్రామ సరిహద్దు వద్దకు చేరుకున్నాయి. ఆ తరువాత దుండగులు పారిపోయినట్లు భావిస్తున్నారు. ఆదివారం నిందితులను కనుక్కునేందుకు మరో ప్రయత్నం చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. రైతులను ఆర్థికంగా దెబ్బతీసే క్రమంలో చెట్లను నరికివేస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతే కాదు గ్రామ బహిష్కరణ కూడా చేస్తామన్నారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడదాం

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: పాలకవర్గం – అధికారులు సమన్వయం, పరస్పర సహకారంతో పని చేసి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడదామని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా బదిలీపై వచ్చిన జి.వెంకటసుబ్బయ్య శనివారం చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకవర్గంతో పాటు ఉద్యోగులతో సఖ్యతగా ఉంటూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని చైర్‌పర్సన్ సూచించారు. అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టారు.

డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య నేపథ్యం

ఉమ్మడి కడప జిల్లా లక్కిరెడ్డిపల్లెకు చెందిన జి.వెంకటసుబ్బయ్య గ్రూప్–2 ద్వారా 1996లో ఈఓపీఆర్‌డీగా ఎంపికయ్యారు. అదే జిల్లా వేముల, రామాపురంలో ఈఓపీఆర్‌డీగా పని చేశారు. ఆ తరువాత పదోన్నతిపై చక్రాయపేట, పెండ్లిమర్రి, రామాపురం, రాజంపేట, ఓబులవారిపల్లి, వీరబల్లిలో ఎంపీడీఓగా సేవలందించారు. 23 ఏళ్ల తరువాత డీఎల్‌డీఓగా పదోన్నతిపై కడప డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఇప్పుడు సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా నియమితులయ్యారు.

చెరువులో వివాహిత మృతదేహం

పరిగి: మండలకేంద్రం పరిగిలోని చెరువు పెద్ద తూము వద్ద శనివారం ఉదయం వివాహిత శవాన్ని స్థానికులు గుర్తించారు. మృతురాలు ధనాపురం గ్రామానికి చెందిన మాధవిగా బంధువులు గుర్తించారు. ఏఎస్ఐ వెంకటేశులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధనాపురంలోని ఎస్సీ కాలనీకి చెందిన మాధవి కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. నాలుగేళ్ల నుంచి మతిస్థిమితం కూడా సరిగా లేదు. భర్త లక్ష్మీనారాయణ పరిగిలోని ఓ గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. మాధవి తన పుట్టిల్లయిన మడకశిర మండలం బుల్లసముద్రం గ్రామానికి తరచూ వెళ్తుండేది. ఈ క్రమంలో ఈ నెల మూడో తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చింది. పుట్టింటికి వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. అయితే శనివారం ఉదయం పరిగి చెరువు నీటిని చూడటానికి వెళ్లిన స్థానికులకు పెద్ద తూము సమీపంలో మహిళ శవం ఉన్నట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు.. శవాన్ని వెలికితీయించారు. మృతురాలు మాధవి అని కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతురాలి అక్క రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. మాధవికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఆదర్శంగా నిలవాలి


గొర్రెల పెంపకం కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా సబ్సిడీ యూనిట్ పొంది లబ్ధి పొందుతున్న వారు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి మండలం పైపల్లిలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసుకున్న పొట్టేళ్ల పెంపకం కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. యూనిట్ నిర్వాహకుడు పాండవ మంజునాథ్‌ను కలెక్టర్ అభినందించారు. ఇలాంటి పథకం ఉపాధితో పాటు జంతు ఉత్పాదకత పెంపొందించడం, గొడుగు కార్యక్రమం కింద మాంసం, మేక పాలు, గుడ్లు, ఉన్ని ఉత్పత్తి పెంచడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. దేశీయ డిమాండ్లు తీర్చిన తరువాత ఎగుమతి ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. గత ప్రభుత్వంలో మంజునాథ్ కోటి రూపాయల వ్యయంతో యూనిట్ ప్రారంభించి రూ.50 లక్షలు సబ్సిడీ అందుకున్నట్లు చెప్పారు. దీని ద్వారా పలువురికి ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారుడు మాట్లాడుతూ గత ఏడాది లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రూ. కోటి రుణం పొంది 525 గొర్రెలను, పొట్టేళ్లను కొనుగోలు చేసినట్లు చెప్పాడు. నెలకు రూ.10 వేలు ఆదాయం పొందుతున్నానని కలెక్టర్‌కు వివరించాడు. కలెక్టర్ వెంట పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, పశువైద్యాధికారి చైతన్య, తదితరులు ఉన్నారు.

మహిళ బలవన్మరణం

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని పార్థసారథి కాలనీలో నివాసముంటున్న సుబ్బన్న భార్య రమణమ్మ (58) శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె కొంతకాలంగా వెన్నునొప్పితో బాధపడుతోంది. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారమందించారు. వారు వచ్చి మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐషర్ డ్రైవర్ దుర్మరణం


రజని (ఫైల్)

రాప్తాడు: రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఐషర్ డ్రైవర్ రజని (40) దుర్మరణం చెందాడు. రాప్తాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం విలుపురం జిల్లా మరకణం తాలుకా ఎందూరు గ్రామానికి చెందిన రజని ఐచర్ వాహనం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తమిళనాడులో బాడుగలు తక్కువగా ఉండడంతో కొన్నేళ్ల క్రితం అనంతపురం వలస వచ్చాడు. రెండు నెలలపాటు బాడుగలు తోలుకుని తర్వాత గ్రామానికి వెళ్లేవాడు. అలా రాప్తాడులో ఐషర్ వాహనాన్ని పెట్రోల్ బంకు సమీపంలో పెట్టుకుని అందులోనే పడుకునేవాడు. ఉదయం వాహనాన్ని తీసుకుని రాప్తాడు మండలంలో 40 మంది కూలీలను తీసుకుని ద్రాక్ష తోటల్లో పనికి తీసుకెళ్లి సాయంత్రం తిరిగి తీసుకొచ్చేవాడు. శుక్రవారం వాహనాన్ని పెట్రోల్ బంకు సమీపంలో ఆపి నిద్రించాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మెలకువ రావడంతో 44వ జాతీయ రహదారి దాటి రోడ్డు అవతలి వైపున టీ తాగి.. తిరిగి వచ్చే క్రమంలో బెంగళూరు నుంచి అతివేగంతో వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో రజని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రాప్తాడు సీఐ టి.వి.శ్రీహర్ష సమాచారం అందుకుని.. కారును వెంబడించి స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతునికి భార్య చిత్ర, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

భార్యతో గొడవపడి బలవన్మరణం

చిలమత్తూరు: భార్యతో గొడవపడిన భర్త ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పలగలపల్లికి చెందిన రియాజ్ (48) మద్యానికి బానిసై పనీపాట లేకుండా తిరుగుతుండేవాడు. నాలుగు రోజుల క్రితం భార్యతో గొడవపడి మనస్తాపం చెందిన రియాజ్ ఓ ఇంట్లోకెళ్లి ఉరివేసుకున్నాడు. మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు శనివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్య నూర్జహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

చెట్టుపైనుంచి పడి వ్యక్తి మృతి

రామగిరి: ఏడుగురాకులపల్లికి చెందిన హరిజన హనుమంతు (54) శనివారం సాయంత్రం చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన హనుమంతు శనివారం తనకున్న పశువులు, మేకలు, గొర్రెలను మేతకోసం గ్రామశివారుకు తీసుకెళ్లాడు. అక్కడ మేత కోసం చెట్టు ఎక్కినపుడు అదుపుతప్పి కిందపడ్డాడు. అటుగా వెళ్లినవారు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే హనుమంతు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇతడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

108లో సుఖ ప్రసవం


నందిని ప్రసవించిన బిడ్డను చూపుతున్న దృశ్యం

గోరంట్ల: ఆస్పత్రికి తరలించేలోపే పురిటినొప్పులు రావడంతో 108 సిబ్బంది వాహనంలోనే సుఖ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. 108 పైలట్ నరసింహులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్నారప్పల్లికి చెందిన నందిని అనే గర్భిణికి శనివారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. భర్త అంజినేయులు నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని, ఆమెను ఎక్కించుకుని గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి బయల్దేరారు. శింగిరెడ్డిపల్లి సమీపంలోకి రాగానే నందినికి పురిటి నొప్పులు మరింత పెరిగాయి. దీంతో ఈఎంటీ అంజినేయులు, సిబ్బంది 108 వాహనంలోనే ఆమెకు ప్రసవం చేశారు. నందిని పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

మట్కా నిర్వాహకురాలి అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో మట్కా నిర్వాహిస్తున్న మహిళను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. రాచప్ప బావి వీధికి చెందిన రేణుకమ్మ మట్కా నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో పట్టణ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి రూ.47,300 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గార్లదిన్నె: తిమ్మంపేట సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పామిడి మండలం కండ్లపల్లికి చెందిన రాముడు, సుధాకర్ ఇద్దరూ శనివారం ద్విచక్రవాహనంపై గార్లదిన్నె మండలం మర్తాడులో శుభకార్యానికి హాజరయ్యారు. అక్కడ వేడుకలు ముగించుకుని తిరిగి వస్తుండగా తిమ్మంపేట వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన సేఫ్టీ రేకును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రాముడు (35)ను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలోనే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు.

పోలీస్ స్టేషన్లా.. సివిల్ పంచాయితీ కేంద్రాలా?

- టూటౌన్ పీఎస్‌లో దుప్పటి పంచాయితీలు
- పోలీసుల అండతో రెచ్చి పోతున్న టీడీపీ కార్యకర్త
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఇంటిపై గంజాయి గ్యాంగ్‌తో దాడికి యత్నం
- డయల్ 100కు ఫిర్యాదు చేసినా స్పందన నిల్.. 2 రోజుల తర్వాత కేసు



వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ చింతా మారుతీ ప్రసాద్ ఇంటి వద్ద దౌర్జన్యం చేస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ధర్మవరంలో పోలీసులు సివిల్ కేసుల్లో తలదూరుస్తున్నారు. తమకు సంబంధం లేకపోయినా జోక్యం చేసుకుంటున్నారు. క్రమేణా సివిల్ పంచాయితీలకు కేరాఫ్ అడ్రస్‌గా పోలీస్‌స్టేషన్‌లు నిలుస్తున్నాయి. కోర్టు పరిధిలో ఉన్న స్థల వివాదంలోకి పోలీసులు రంగప్రవేశం చేసి అధికార టీడీపీ వారికి అండగా నిలుస్తున్నారు. పోలీసుల అండ చూసుకుని టీడీపీ వారు రెచ్చిపోయి అవతలి వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని 35వ వార్డు కౌన్సిలర్ చింతా మారుతీ ప్రసాద్ కొన్నేళ్ల కిందట మారుతీనగర్‌లో రెండు సెంట్ల స్థలం కొన్నారు. మున్సిపల్ అప్రూవల్ తీసుకుని నిబంధనల ప్రకారం కౌన్సిలర్ ఇల్లు నిర్మించుకున్నారు. అయితే ఇదే స్థలానికి టీడీపీ కార్యకర్త జిలకర శ్రీనా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కొంత కాలంగా మారుతీ ప్రసాద్‌తో గొడవపడుతున్నాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఇక తమకు ఎదురులేదంటూ రెచ్చిపోతున్నాడు. రెండు సెంట్ల స్థలానికి కౌన్సిలర్ 40 ఏళ్లకు సంబంధించిన పత్రాలను చూపుతుంటే.. టీడీపీ కార్యకర్త మాత్రం రెండు సెంట్ల స్థలానికి గాను నాలుగు సెంట్ల విస్తీర్ణం ఉన్న ఫేక్ డాక్యుమెంట్‌తో వితండవాదం చేస్తున్నాడు. దీంతో విసిగి వేజారిన కౌన్సిలర్ చింతా మారుతీ ప్రసాద్ కోర్టులో కేవియట్ వేశాడు. దీంతో ఆగ్రహించిన జిలకర శ్రీనా టూటౌన్ పోలీసులను రంగంలోకి దింపాడు. ఈ స్థలం కోర్టు వివాదంలో ఉందని తెలిసినా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇరువర్గాలను పిలిపించి 'పంచాయితీ' పెట్టారు. ఇదిలా ఉండగానే ఈ నెల మూడో తేదీన టీడీపీ కార్యకర్త జిలకర శ్రీనా గంజాయి తాగే బ్యాచ్‌ను తీసుకొచ్చి కౌన్సిలర్ ఇంటిపై దాడికి ఉసిగొల్పి హంగామా సృష్టించాడు. ఇంట్లోకి వెళ్లి మహిళలను బెదిరించాడు. భయాందోళనలకు గురైన బాధితులు వెంటనే డయల్ 100కి ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులెవరూ సంఘటన స్థలానికి చేరుకోలేదు. ఇదే అదనుగా గంజాయి గ్యాంగ్ తమను ఏమైనా చేసి ఉంటే పరిస్థితి ఏంటని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తర్వాత నేరుగా వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు తాత్సారం చేస్తూ రెండు రోజుల తర్వాత ఐదో తేదీ కేసు నమోదు చేశారు. అంతటితో ఆగకుండా బాధితులను భయభ్రాంతులకు గురి చేసేందుకు బాధితులపైనే పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఇలా ఏకపక్షంగా వ్యవహరిస్తూ పోలీస్ వ్యవస్థ మీద నమ్మకం కోల్పోయేలా చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.